

ఆందోళనలో నేతన్న

- దశాబ్దాలు గడుస్తున్నా మారని బతుకులు
- బిల్లులు రాక ఇక్కట్లు
- వృద్ధ కార్మికులకే చేనేత పరిమితం

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 15: జిల్లాలో ఎక్కువ శాతం చేనేత కార్మికులకు ఉన్నారు. అయితే ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా వీరి బతుకులు మాత్రం మారడం లేదు. కులవృత్తిని నమ్ముకున్న కుటుంబాలు ఇతర వృత్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. తాము బతకడంతోపాటు మరికొంత మందికి ఉపాధి కల్పించాల్సిన చేనేత కార్మికులు బతుకుదెరువు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో ఇతర వృత్తివ్యాపారాల్లోకి వెళ్లిపోతున్నారు. కాగజ్‌నగర్ సొసైటీలో గతంలో 60మంది పనిచేసేవారు. ప్రస్తుతం వయోభారంతోపాటు ఇతర కారణాలతో వారిలో కొంతమంది వేరేవృత్తిలోకి వెళ్లగా కేవలం 30మందితోనే ప్రస్తుతం సొసైటీని నడిపిస్తున్నారు. ఈ సొసైటీ ద్వారా చేనేత కార్మికులకు పని కల్పించి వారు తయారు చేసిన బెడ్ షీట్స్ కార్పెట్స్‌ను ప్రభుత్వం ఆధ్వర్యంలోని హాస్టళ్లకు సప్లయ్ చేస్తారు. వాటిపై వచ్చే బిల్లులను త్వరగా మంజూరు చేయక రోజు వారి కూలీగా వచ్చే రూ. 250నుంచి 450కూడా రాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సర్‌సిల్క్‌మిల్లు మూసివేతతో..

35సంవత్సరాల క్రితం సర్‌సిల్క్(వస్త్ర పరిశ్రమ) మూతపడడంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కాగజ్‌నగర్‌లోని ఈ మిల్లులో వేలాది మంది పని చేస్తుండేవారు. వారంతా మహారాష్ట్రలోని షోలాపూర్, బీవండి, హైదరాబాద్, సూరత్ తదితర పట్టణాలకు వెళ్లారు. స్థానికంగా ఉన్న కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం కాగజ్‌నగర్ చేనేత సహకార సంఘం ఉత్పత్తులు, విక్రయ సంఘాన్ని 2002లో భవనం మంజూరు చేసి నిర్మించింది. ఈ సొసైటీ ద్వారా పలువురు మహిళా కార్మికులు ఉపాధి పొందుతున్నారు. మిల్లు మూసివేసినప్పటి నుంచి నామమాత్రంగా బతుకులు వెళ్లతీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చేనేత కార్మికులకు చేయూతను అందించే దిశగా ప్రవేశపెట్టిన పథకాలు మధ్యలో నిలిచిపోవడంతో పూట గడవని పరిస్థితి ఉంది.

● నిలిచిన చేనేత మిత్ర

చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే చేనేత మిత్ర పథకం కొంత కాలంగా నిలిచిపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. చేనేత కార్మికులకు రూ.2000, అనుబంధ కార్మికుడికి నెలకు రూ.500 చేనేత చేయూత (థ్రిఫ్ట్ పథకం) కింద ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ పథకం నిలిచిపోయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల కిందట చేనేత సొసైటీని సందర్శించిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు చేనేతల సంక్షేమానికి తగిన నిధులు ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్లు కార్మికులు పేర్కొన్నారు. అలాగే చేసిన పనికి వచ్చే మొత్తం కూలీకి రెట్టింపుగా వచ్చే రికరింగ్ డిపాజిట్ పథకం కూడా పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు. దీంతోపాటు వ్యక్తిగత రుణాలు మాఫీ చేసి, ముద్ర రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులు నేసిన వస్త్రాలకు నిలిపి వేసిన బిల్లులు మంజూరు చేస్తే అటు ఉపాధితో పాటు మరోవైపు వడ్డీ భారం తగ్గినట్లు అవుతుందని పేర్కొంటున్నారు.

బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి..

-నల్ల కనకయ్య, చేనేత సహకార సొసైటీ కార్యదర్శి



కాగజ్‌నగర్ చేనేత సహకార సంఘంలో పనిచేసిన కార్మికులకు కొద్ది రోజులుగా బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు ఇప్పించాలి. అలాగే ముద్ర, ఇతరరుణాలు, వడ్డీమాఫీ, చేనేత చేయూత, థ్రిఫ్ట్ తదితర పథకాలను కొనసాగించి కార్మికులకు సహకరించి ఆదుకోవాలి.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



నిమజ్జనస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 15: కాగజ్‌నగర్ పెద్దవాగులో గణేష్ నిమజ్జన స్థలాన్ని ఆదివారం ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జనం చేసేందుకు తీసుకునే చర్యలు, వాహనాల పార్కింగ్, తదితరాలపై పట్టణ డీఎస్పీ రామానుజంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీసీ కెమెరాలను పరిశీలించారు. తహసీల్దార్ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పురుషోత్తమరావు ఆశయాలను కొనసాగిద్దాం

● ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 15: మాజీఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తమ రావు ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక పటేల్‌గార్డెన్‌లో ఆదివారం మాజీఎమ్మెల్యే పురుషోత్తం రావు 25వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తం రావు జ్ఞాపకార్థం ప్రజాబంధు స్వచ్ఛంద సంస్థ పేరిట మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా పురుషోత్తమ రావు చేసిన సేవలను గుర్తు చేశారు. వర్ధంతి సభ ఉన్నందున మెగా వైద్య క్యాంపునకు హాజరైన వైద్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 15: జిల్లాకేంద్రంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీర్లు శవిధర్,హ్యూమన్ అలీలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఉబెద్‌బీన్ యాయా, వినేష్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ ఎల్‌బీఎస్ గణేష్ మండలికి 60 ఏళ్లు



సర్‌సిల్క్ కాలనీలో ఏర్పాటు చేసిన ఎల్‌బీఎస్ గణేష్ మండపం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 15: కాగజ్‌నగర్ సర్‌సిల్క్ లాల్ బహదూర్ శాస్త్రి(ఎల్‌బీఎస్) గణేష్ మండలి ఏర్పాటు చేసి నేటికి సరిగ్గా 60 ఏళ్లు పూర్తి అయింది. ఇది ప్రారంభించిన వారు ప్రస్తుతం లేకపోయినప్పటికీ వారి తరం వారు మాత్రం యథావిధిగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నడిపిస్తున్నారు. భక్తుల కొంగు బంగారంగా పేరుగాంచిన సర్‌సిల్క్ ఎల్‌బీఎస్ గణేష్ మండలి గణేషుడికి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. కాగజ్‌నగర్ మండలాల నుంచే వారు కాకుండా సిర్పూరు(టి), కౌటాల, బెజ్జూరు, దహెగాం, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, కెరమెరి ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. 60ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 8 రోజులుగా అన్నదాన కార్యక్రమాలు, దీపారాధన, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో సర్‌సిల్క్‌మిల్లు 1952లో ఉత్పత్తిని ప్రారంభించింది. సర్‌సిల్క్‌మిల్లు ఆసియాలోనే నంబర్1 మిల్లుగా పేరొందింది. 1964లోనే ఈ మండలిని ప్రారంభించారు. ఈ కాలనీకి చెందిన పెద్దమనుషులు, మిల్లు కార్మికులు తలాకొంత చందాలు వేసుకొని గణేష్ మండలి ఏర్పాటు చేసినట్టు ఇక్కడి పెద్దమనుషులు చెబుతున్నారు. కాగజ్‌నగర్ మొత్తంలో రెండు మండలిలోనే గణేష్ మండపాలుం డేవని తెలిపారు. కాలక్రమేణా జనాభా పెరగటంతో పట్టణంలో 300లకుపైగా గణేష్ మండల్ల వరకు చేరుకుంది.

అప్పుడు నాకు 10ఏళ్లు ...

-బింగి రమేష్, కాగజ్‌నగర్



నాకు 10ఏళ్లు ఉండగా ఇక్కడ మండపాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు నావయస్సు 70సంవత్సరాలు. కాగజ్‌నగర్‌లో సర్‌సిల్క్ మిల్లు నడిచేది. ఈ ప్రాంతం రద్దీగా ఉండేది. కాలనీ పెద్దమనుషులు, మిల్లు కార్మికులు కలిసి చందాలు వేసుకొని చిన్నగా మండపాన్ని వేసి నవరాత్రులు చేశారు. ఆ తర్వాత ఇక్కడ స్థాపించిన పెద్దమనుషులు కాలం చేశారు. ఇప్పుడు వాళ్ల పిల్లలంతా అదే మండపాన్ని కొనసాగిస్తున్నారు. 60ఏళ్లలో ఎన్నడూ కూడా క్రమం తప్పలేదు. ఏటా వినాయకుడిని ప్రతిష్టించి పూజలు చేసి నిమజ్జనం చేస్తాం.

మా పెద్దనాన్న నిర్వహించేవారు..

-వేణుగోపాల్, కాగజ్‌నగర్



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి మా పెద్దనాన్న దాతల సహాయంతో ఈ మండపాన్ని నిర్వహించే వారు. ఈసారి విగ్రహాన్ని మేమే అందజేశాం. చాలా సంతోషంగా ఉంది. మండపంలో ఏటా గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం, పూజలు చేయటం, నిమజ్జన కార్యక్రమాలు కన్నుల పండువగా చేస్తాం. 60 ఏళ్లు కావటం మాటల్లో చెప్పరాని ఆనందంగా ఉంది.

పెద్దల బాటలోనే నడుస్తున్నాం..

-వెంగల నగేష్, సర్‌సిల్క్, కాగజ్‌నగర్



మా పెద్దలు చూపించిన బాటలోనే నడుస్తున్నాం. అందరినీ కలుపుకొని అడుగులు వేస్తున్నాం. 60ఏళ్లు పూర్తి చేసుకోవటం గర్వంగా ఉంది. ప్రతిరోజు పూజలు, దీపారాధన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

జాబ్ మేళాకు అనూహ్య స్పందన

కాగజ్‌నగర్, సెప్టెంబరు 15: టాటా కంపెనీ వారి సౌజన్యంతో ఆదివారం రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ భవనంలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ భవిష్యతులో దేశవ్యాప్తంగా తమ సేవలు విస్తరించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాబ్‌మేళాలో వివిధ అవకాశాలపై వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



లారీలో పశువులు

రెబ్బెన, సెప్టెంబరు 14: మహారాష్ట్రలోని గట్‌చందూర్ నుంచి నిజామాబాద్‌కు పశువులను లారీలో అక్రమంగా తరలిస్తుంగా పుంజుమేరగూడ వద్ద పట్టుకున్నట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గట్‌చందూర్ మీదుగా లారీలో పశువులను తరలిస్తున్నట్టు ముందస్తు అందిన సమాచారం మేరకు పుంజుమేరగూడ వద్ద లారీని ఆపాం. లారీలో 20ఎద్దులు, 15ఆవులు ఉన్నా యి. ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు లారీతోపాటు డ్రైవర్ మహ్మద్ అతం, క్లీనర్ సయ్యద్ వాహిబ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పట్టుకున్న ఆవులను కాగజ్‌నగరలోని గోశాలకు తరలించామన్నారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి

రెబ్బెన, సెప్టెంబరు 15: మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివని జీఎం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఇంజనీర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలను జీఎం కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రాయమల్లు, ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో బెల్లంపల్లి ఏరియాకు గుర్తింపు తేవాలి

రెబ్బెన, సెప్టెంబరు 15: క్రీడాపోటీల్లో బెల్లంపల్లి ఏరియాకు గుర్తింపుతేవాలని ఏరియా ఎస్‌వోటు జీఎం రాజమల్లు అన్నారు. ఆదివారం బెల్లంపల్లి ఏరియాస్థాయి చదరంగపోటీలు గోలేటిటౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోలేటి టౌన్‌షిప్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయపోటీల్లో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'35శాతం లాభాల వాటా ప్రకటించాలి'

బెల్లంపల్లి, సెప్టెంబరు 15: కార్మికులకు 35శాతం లాభాల వాటా ప్రకటించాలని టీఎస్‌టీయూసీ సెక్రెటరీజనరల్ మణిరాంసింగ్ అన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టుకార్మికులు పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నారని, లాభాలు రావడానికి వారి శ్రమకూడా ఉందన్నారు. లాభాలలోవాటా, దసరా అడ్వాన్స్ పర్మినెంట్ కార్మికులతో సమానంగా చెల్లించాలన్నారు. గత సంవత్సరం సీఎండీ కార్మికసంఘాలకు, కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల్లో వాటా, దసరాఅడ్వాన్స్ ఇప్పించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారని, మాట నిలబెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

'మినిస్టీరియల్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 15: సింగరేణి మినిస్టీరియల్‌స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఏరియా అధ్యక్షకార్యదర్శులు గుండ్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడారు. జూనియర్ అసిస్టెంట్‌నోటిఫికేషన్‌ఇచ్చి, ఇప్పటివరకు పరీక్షతేదీని చెప్పకపోవడంతో కార్మికులు అయోమయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పరీక్షలు నిర్వహించి, సిబ్బంది ఖాళీలను భర్తీచేయాలని కోరారు. కొత్త ఫర్నీచర్, నూతన ప్రింటర్లు ఇవ్వాలని, సీఎంపీఎఫ్ చిట్టీలను సకాలంలో ఇచ్చేలా చూడాలని, డెలిగేషన్ పవర్‌ను ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బ్రాంచ్‌కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళశ్రీనివాస్, పిట్‌కార్యదర్శులు ఎంశ్రీధర్, శైల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పరిశ్రమల ఏర్పాటుపై సీఎండీ దృష్టి

మందమర్రి టౌన్, సెప్టెంబరు 15: సింగరేణి సంస్థ ప్రత్యామ్నాయ పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టిని సారించింది. ఇప్పటికే సోలార్‌పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్న సింగరేణి సిమెంట్, ఇతర ఆర్థికఆదాయం లభించే పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సీఎండీ ఇతర పరిశ్రమల ఏర్పాటు గురించి వివరించినట్లు తెలుస్తోంది. బొగ్గురవాణాకు సంబంధించి సరికొత్త పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టేందుకు చూస్తోంది.

తిరుగులేని వీరులు.. ఆసిఫాబాద్ యోధులు..

- తెలంగాణ విమోచనంలో ప్రముఖపాత్ర
- నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం
- భారత సైనికదళాలతో కలిసి పోరాటం
- నిజాం లొంగుబాటుకు కృషి
- రేపు తెలంగాణ విమోచన దినోత్సవం
- ప్రజాపాలన దినోత్సవం నిర్వహించనున్న సర్కార్



చీల శంకర్ (ఫైల్) నాగేంద్రయ్య (ఫైల్) కొండా లక్ష్మణ్ బాపూజీ (ఫైల్) రేవయ్య (ఫైల్)



జోడేఘాట్‌లో కుమరం భీం విగ్రహం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 15: నిజాంపాలన విముక్తి పోరాటంలో ఆసిఫాబాద్ ప్రాంత సమరయోధులపోరాటం మరువలేనిది. ఆసిఫాబాద్ ప్రాంతానికిచెందిన పలువురు యోధులు మహారాష్ట్రలోని చంద్రాపూర్ మిలటరీ శిక్షణ క్యాంపులో చేరి సాయుధశిక్షణను పొందారు. మిలటరీ పంజాబ్ రెజిమెంట్ లేజర్ పీఎస్ గుహన్ శిక్షణను అందించారు. అక్కడ క్యాంపు ఇన్‌చార్జి గోపాల్ శాస్త్రీ బేకర్, బల్లార్షా క్యాంపు ఇన్‌చార్జిగా కేవీ కేశవులు వ్యవహరించగా కొండా లక్ష్మణ్‌బాపూజీ ఈ క్యాంపులకు వ్యూహకర్తగా వ్యవహరించారు. ఆసిఫాబాద్‌కు చెందిన చీల శంకర్, చీల విఠల్, కాంద్రె శంకర్, చందన్‌వార్ విఠల్, జగన్నాథ్, రేవయ్య, రాంసింగ్, నాగేంద్రయ్య, తిరుపతి, వెంకటేశం సాయుధ శిక్షణ శిబిరంలో ఏడాదికాలం పాటు శిక్షణ పొందుతూ సాయుధ పోరాటాన్ని నిర్వహించారు.

రజాకార్లను మట్టుపెట్టి నిజాం గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన చరిత్ర ఘట్టాలు ఆసిఫాబాద్ ప్రాంతంలో కోకొల్లలుగా ఉన్నాయి. నిజాం నిరంకుశపాలన, రజాకార్ల అరాచకాలతో సహనం కోల్పోయిన సామాన్య ప్రజలు సైతం స్వచ్ఛంద భారత సిపాయిలై తుపాకీ పట్టి సాయుధ పోరాటం చేయడంతో నిజాం ప్రభుత్వం గడగడలాడింది. 1940వరకు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా కొనసాగిన నేపథ్యంలో పలువురు సమరయోధులు బ్రిటీష్‌పాలన వ్యతిరేక పోరాటం, వందేమాతరం, క్విట్‌ఇండియా ఉద్యమాలు, హిందీ మహాసభ ప్రచారం జరిపి జైలుజీవితం అనుభవించిన స్ఫూర్తితో 1947 నుంచి 1948సంవత్సరాల్లో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తుపాకీ పట్టి పోరాటం చేసేందుకు బీజం పోసింది. ఆసిఫాబాద్ ప్రాంతం నుంచి చీల శంకర్, చీల విఠల్, రాంసింగ్, కాంద్రె శంకర్, రేవయ్య, నాగేంద్రయ్య, బోనగిరి వెంకటేశం, చందావార్ విఠల్, కాటెపల్లి తిరుపతి, జగన్నాథ్ అజ్ఞాతంలోకి వెళ్లి మహారాష్ట్రలోని చాందలో నిర్వహించిన సాయుధశిక్షణ శిబిరంలో ఏడాదిపాటు శిక్షణ పొందుతూ వివిధ సంఘటనల్లో పాల్గొన్నారు. భారత సైనికదళాలకు అండగా ఉంటూ ప్రాణాలకు తెగించి రణరంగంలో దూకిన ఆసిఫాబాద్ సమరయోధులు నిజాం లొంగుబాటుకు దరూర్ రైల్వేస్టేషన్ విధ్వంసం చేసిన సంఘటనలో పాల్గొన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో కలిపేందుకు అప్పటి హోం మంత్రి సర్దార్ వల్లాభాయ్ పటేల్ ఆదేశాలతో 13.09.1948 పోలీసుయాక్షన్ ప్రకటితమైంది. మహారాష్ట్ర సైనికదళాలు చాందా, బల్లార్షా క్యాంపుల్లో సుశిక్షితులైన ఆసిఫాబాద్ యోధులు రజాకార్లను మట్టుపెట్టేందుకు ముందుకు సాగారు. ఈ పోరాటం హోరాహోరీగా జరిగింది. సెప్టెంబర్ 14న బల్లార్షా సాస్రి ప్రాంతంలో జరిగిన పోరాటంలో 10మంది నిజాం వ్యతిరేక ఉద్యమకారులు మరణించారు. సెప్టెంబర్ 15న సైనికదళాలు మాణిక్‌ఘడ్ పోలీసు అవుట్‌పోస్టుపై దాడి చేశారు. సెప్టెంబర్ 16న సిర్పూర్, బెజ్జూరు అవుట్ పోస్టులు భారతసైనిక పరమయ్యాయి. సెప్టెంబర్ 17న నిజాంసర్కార్ సైన్యానికి తలొగ్గి హైదరాబాద్ సంస్థాన్ భారత్‌లో విలీనం అయింది. సెప్టెంబర్ 18న ఆసిఫాబాద్ జిల్లా జైలులోని 200 మందిఖైదీలు గేట్లు విరగొట్టుకుని బయటకు వచ్చారు.



ఆసిఫాబాద్‌లోని స్పెషల్ సబ్ జైలు

భావితరానికి స్ఫూర్తి కుమరం భీం, కొండా లక్ష్మణ్ బాపూజీ..

సమరయోధుల వీరోచిత పోరాటం, భారత ప్రభుత్వ మిలటరీ యాక్షన్ ఫలితంగా మనం నిజాం నిరంకుశత్వం నుంచి బయటపడ్డాం. సుదీర్ఘ పోరాటం, ఎందరో అమర వీరుల త్యాగఫలంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. అడవుల జిల్లాగా పేరున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాడు నిజాం నిలువుదోపిడి వ్యవస్థ కొనసాగింది. రజాకార్ల అరాచకాలు పరాకాష్టకు చేరాయి. అరకపట్టి, మే పట్టి, మంచెపట్టి, బంచరాయి లాంటి పన్నులతో గిరిజన రైతులను దోచుకున్నారు. అడవి బిడ్డలకు అడవిపై హక్కులు లేవన్నారు. ఈ నేపథ్యంలో సాయుధ పోరుకు దిగిన కుమరం భీం నిజాంపై వీరోచితంగా పోరాడి వీరమరణం పొందారు. జిల్లా గిరిజనుల్లో పోరాట స్ఫూర్తి నింపారు. గిరిజన హక్కుల కోసం తిరుగుబాటు నేర్పారు. భీం పోరాట స్ఫూర్తితోనే ఈ ప్రాంతంలో వందలాది మంది యువకులు నిజాంపై తుపాకీ ఎక్కు పెట్టారు. జిల్లాలో గిరిజన హక్కుల పోరాటం, భారత స్వాతంత్ర్య పోరాటం, ప్రత్యేక తెలంగాణ పోరాటం చరిత్రలో ప్రముఖంగా నిలిచిపోయాయి. గొప్ప పోరాట నేపథ్యం ఉన్న జిల్లాలో స్వాతంత్ర్య పోరాటంలో హైదరాబాద్ విలీనం పోలీసు యాక్షన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీతోపాటు వందలాది మంది సమరయోధులు పోరాడి భావితరానికి స్ఫూర్తిగా నిలిచారు.

కల సాకారం..

భారత స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు నిజాం నిరంకుశత్వం నుంచి హైదరాబాద్ విలీన సాయుధ పోరులో కొండాలక్ష్మణ్ బాపూజీ ప్రముఖ పాత్ర పోషించారు. క్విట్‌ఇండియా ఉద్యమం, స్వాతంత్ర్య పోరు, నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడానికి జరిగిన పోరాటంలో ప్రముఖపాత్ర పోషించిన వారిలో కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్యుడు. 1969నుంచి కొనసాగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు. 2008నవంబర్‌లో ఆయన ప్రత్యేక తెలంగాణను తమకు తాము ప్రకటించుకొంటామని సంచలన ప్రకటన చేశారు. 2009 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్రను పోషించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ సాయుధ సమితిని ఏర్పాటు చేశారు. తెలంగాణ రాజకీయ ఐకాస, టీఆర్ఎస్‌లతో ఇతర రాజకీయ పార్టీల విధానాలతో ఆయన విభేదించారు. నవ తెలంగాణ ప్రజాపార్టీని ప్రకటించారు. 96 ఏళ్ల వయస్సులోనూ ప్రత్యేక తెలంగాణ కోసం ఆయన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్షకు కూర్చున్నారు. సెప్టెంబర్ 22, 2012న మరణించే వరకు తెలంగాణ సాధన కోసం కృషి చేశారు.

రేపు ప్రజాపాలన దినోత్సవం..

సెప్టెంబరు17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా పరిగణిస్తూ వేడుకలను నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకుగాను ఈనెల 11న తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులను జారీచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబరు 17న ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించి అన్నిజిల్లాలలో జాతీయ జెండాలను ఎగురవేయాలని, ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ప్రజాప్రతినిధులను ఎంపిక చేసింది. జిల్లాకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ప్రజాపాలన దినోత్సవానికి ముఖ్య అతిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటు



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 15: సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎస్టీ పోస్టుమెట్రిక్ బాలురహాస్టల్‌లో సంతాపసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాల నుంచి దేశరాజకీయాల్లో ఏచూరి పాత్ర మరువలేదన్నారు. అనంతరం సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయికృష్ణ, కార్తీక్, సాయికుమార్, టీకానంద్, నితిన్, సతీష్, శ్రీకాంత్, భారతి, మంజుల, అరవింద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- రెండు వాహనాలను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- స్కూటీని 150 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లడంతో..

తాత, మనుమరాలు దుర్మరణం

- మనుమడి పరిస్థితి విషమం

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 15: ఓ ప్రైవేటు బస్సు అతివేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఉత్సాహంగా గణేష్ నిమజ్జన వేడుకలు చూసేందుకు వెళ్తూ తాత, మనుమరాలు తిరిగి రాని లోకాలకు వెళ్లి పోయారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస లో ఆదివారం ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. జగిత్యాల-ధర్మపురి జాతీయ ర హదారిపై జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస స్టేజీ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆగిఉన్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో అతివేగంగా రెండు ద్విచక్ర వా హనాలను ఢీకొట్టింది. ఈఘటనలో రాయికల్ మండలం అల్లీపూర్‌కు చెందిన బైండ్ల ల చ్చన్న (52) ధర్మపురి పట్టణానికి చెందిన నారవేణి శ్రీనిధి(09) అక్కడిక్కడే మృతి చెం దారు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన బైండ్ల లచ్చన్న కూతురు మమత ధర్మపురిలో ఉం టు న్నారు. అల్లీపూర్‌లో జరుగుతున్న గణేష్ నిమజ్జన వేడుకలను పిల్లలకు చూపించాలని కూతురి కోరిక మేరకు ధర్మపురి నుంచి అల్లీపూర్‌కు మనుమడు, మనుమరాలును తీసు కొని ద్విచక్రవాహనంపై బయల్దే రారు. మార్గమధ్యలోని జగిత్యాల రూరల్ మండలం పొ లాస వద్దకు చేరుకోగానే వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని కొండగట్టు నుంచి ధర్మపురి వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు నంబర్ (టీఎస్ 21 యూడీ 9955) అతి వేగంగా ఓవర్‌టేక్ చేసి బలంగా ఢీకొట్టింది. దీంతో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బస్సు 150 మీటర్ల మేర ఈడ్చుకెళ్లడంతో శ్రీనిధి, లచ్చన్న అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలు నుజ్జునుజ్జై రహదారిపై చెల్లాచెరుదుగా పడిఉన్నాయి. మల్లి కార్జున్‌కు తీవ్ర గాయాలవడంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదే ఘ టనలో జగిత్యాల రూరల్ మండలం పొలాసకు చెందిన బూర్ల రాజన్న, బద్దెనపల్లి నర్స య్యలు ప్రయాణిస్తున్న స్కూటీని సైతం బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాలై జగిత్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్ పరిశీలించారు.

కాగా జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమా దానికి అతివేగమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొండగట్టు వైపు నుంచి ధ ర్మపురి వైపు అతివేగంగా వస్తున్న ప్రైవేట్ బస్సు పొలాస స్టేజీ వద్ద ఆగిఉన్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వస్తున్న రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని వారు సంఘటన స్థలంలో చర్చించుకున్నారు. కొంత వేగం తగ్గి ఉంటే ప్రమాద తీవ్రత తగ్గి ఉండేదని స్థా నికులు భావిస్తు న్నారు. కుటుంబసభ్యులు సంఘటన స్థలంలో రోదిస్తున్న తీరు పలువు రిని కంటతడి పెట్టించింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతితో రాయికల్ మం డలం అల్లీపూర్, ధర్మపురిలో తీవ్రవిషాదం చోటుచేసుకుంది.

గల్ఫ్ కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 15: విదేశాల్లో ఉపాధి పొందుతూ, తెలంగాణ ఖజా నాకు ఆదాయం సమకూర్చుతున్న గల్ఫ్ కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. సుమారు 15లక్షల కుటుంబాలకు పైగా గల్ఫ్ దేశాలలో ఉపాధిని పొందు తున్నార న్నారు. సగటున ఒక్కో కుటుంబానికి నెలకు రూ.10వేల వేతనం పొదుపు గా భావించిన నెలకు రూ.1500 కోట్ల విదేశీమారక ద్రవ్యం సమకూ ర్చబడుతుందన్నారు. ఇదే లెక్కన ఏడాదికి 18వేల కోట్లు, గడిచిన పదేళ్ల తెలంగాణ పాలనలో సుమారు లక్ష80వేల కోట్ల ఆదాయం చేకూరిందనేది స్పష్టమవుతుందన్నారు. ఇందులో నుంచి ఏ మార్గం ద్వారా ఖర్చు పెట్టిన కనీసం 10శాతం అమ్మకపు పన్నుద్వారా సుమారు 18వేల కోట్లు ఆదాయం గల్ఫ్ కుటుంబాలద్వారా వచ్చిందని భావించక తప్పదన్నారు. ఇంత ఆదా యం రాష్ట్రానికి ఒనగూర్చిపెడుతున్న తెలంగాణ గల్ఫ్ బిడ్డలకు కనీసం ఒక్కపైసా లాభం ఒనగూర్చకపోవడం దురదృష్టకరం అన్నారు. కేరళ తరహాలో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు



మంచిర్యాలలో 108 ప్రసాదాలతో గణనాథుడికి నైవేద్యం సమర్పించిన మహిళలు

మంచిర్యాల, సెప్టెంబరు 15: జిల్లాలోని పలు చోట్ల ప్రతిష్ఠించిన గణనాథుల వద్ద ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా మండపాల్లో నిర్వహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల టీచర్స్ కాలనీలోని శ్రీ సాయి గణేశ్ మండలిలో 108 ప్రసాదాలతో మహిళలు గణనాథుడికి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు.

మంచిర్యాల కలెక్టరేట్: మొదటి పూజలు అందుకునే వినాయకుడి పూజలు సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని మంచిర్యాల రామ్‌నగర్ అర్చకులు సముద్రాల రమణాచార్యులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వినాయక పూజలను ఘణంగా నిర్వహించారు. విద్యానగర్‌లో వినాయకుడికి 108 ప్రసాదాలు, పండ్లు అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తుల మధుసూదన్‌రావు, శ్రీనివాస్, మున్నా, ధైర్యరావు, మహిళలు పాల్గొన్నారు. కాగా జిల్లా కేంద్రంలో కుంకుమా ర్చనలు నిర్వహించారు. స్థానిక మండలి నిర్వహకులు, భక్తులు విజయ్, రాణి, రాజమల్లు, నాగమణి, శ్రీనివాస్, భార్గవి, మౌనిక, అజయ్, శ్రీనివాస్, స్వప్న, సంతోష్, కార్తీక్ రజిత, జనార్దన్ పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలో ఆదివారం గణేశ్ శోభాయాత్ర అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళల కోలాటాలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. గాంధీ చౌక్ విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో స్వాగతోత్సవాన్ని ఏర్పాటు చేశారు. నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మున్సిపాల్టీ అధికారులు చెరువు వద్ద ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పెద్ద గణనాథ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్‌లను ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరుగకుండా అగ్నిమాపక సిబ్బందితో పాటు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. నిమజ్జన ఏర్పాట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. చెన్నూరు, రూరల్ సీఐలు రవీందర్, సుధాకర్ ఆధ్వర్యంలో చెన్నూరు, భీమారం, నీల్వాయి, భీంపూర్ ఎస్సై భారీ బందోస్తు ఏర్పాట్లు చేశారు. చెరువు కట్ట ఘాట్ వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన రాంలాల్ గిల్డా పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

దండేపల్లి: దండేపల్లిలో శివగణేశ్ భక్త మండలి వినాయక మండలంలో శనివారం రాత్రి 108 దీపాలతో మహిళ భక్తులు దీపారాధన పూజలు చేశారు. బాల గణేశ్ వినాయక మండపం వద్ద ఆదివారం మహిళ భక్తులు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మండలంలోని పలు గణేష్ మండపాల్లో అన్నదాన వితరణ చేపట్టారు.

నెన్నెల: మండల కేంద్రంలోని గంగపుత్ర గణేశ్ మండలి, కొండు వాడ మండళ్లలో కొలువు దీరిన గణనాథుడికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు ఎంపీకి ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు ఎంపీని శాలువాలతో సన్మానించారు. మండల సమస్య లను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గట్టు మల్లేష్, నాయకులు హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, మల్లాగౌడ్, రాజశేఖర్ ఉన్నారు.

మందమర్రి రూరల్: గణనాథుడి మండపాల వద్ద హోమాలు, అన్నదానాలు నిర్వహించారు. బాలవరసిద్ధి వినాయక మండలి వద్ద హోమం నిర్వహించి అన్నదానం చేశారు.

18న భవన నిర్మాణ కార్మిక సంఘాల ధర్నా

- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మానందం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 15: భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి బ్రహ్మానందం తెలిపారు. ఐఎఫ్‌టీయూ శ్రీరాంపూర్ కార్యాలయంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా కమిటీ సమా వేశం ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 23న చలో హైదరా బాద్ చేపట్టనున్నట్లు చెప్పారు. కార్మిక సంక్షేమ బోర్డును నిర్వహిస్తున్న ప్రభుత్వం, కార్మికులకు ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక, అంగవైకల్యం వంటివి సంభవిస్తే ఆదుకునే పరిస్థితి లేదన్నారు. ఆయా అంశాలను ప్రైవేటు కంపెనీలకు టెంబర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించానలి కోరారు. నిధులను కార్మికుల సంక్షేమానికి, వారి పిల్లల చదువు, ఉపకార వేతనాల అందజేత, సొంత గృహ వసతి, వంటి వాటికి ఉపయోగిం చాలని చెప్పారు. ఇతర సమస్యలను పరిష్కరిం చాలనే డిమాండ్‌తో బుధవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నేదూరి నర్సయ్య, మంతెన లక్ష్మయ్య, సుగుణ, లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే



ఇంజనీర్లను సన్మానిస్తున్న లయన్ సభ్యులు

మంచిర్యాల, సెప్టెంబరు 15: జిల్లా కేంద్రంలో లయన్ సభ్యులు ప్రఖ్యాత ఇంజనీరు మోక్షం గుండం విశ్వేశ్వర్య జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రోగ్రాం చైర్‌పర్సన్ వి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఇంజనీర్లు ఎండీ మసూద్ అలీ, బి హరీష్, మహేందర్ రెడ్డి, అభిరామ్‌లను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సుగుణాకర్‌రెడ్డి, లయన్ సభ్యులు సత్యపాల్ రెడ్డి, నాగేందర్, చందూరి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టడం సరికాదు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 15: మందమర్రి ఏరియాలోని ఓ సివిల్ సూపర్‌వైజర్ కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని కాంట్రాక్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వల్ల కాంట్రాక్టు వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వేధించడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ హాస్టల్‌లో పిచ్చి మొక్కుల తొలగింపు

నెన్నెల, సెప్టెంబరు 15: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆదివారం పరిసరాల్లోని పిచ్చిమొక్కలతో పాటు చెత్తాచెదారం తొలగించారు. మరుగుదొడ్లు, స్నానాల గదులను శుభ్రం చేశారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త పాపిరెడ్డి, జిల్లా యువజన విభాగం సమన్వయకర్త హనుమంతరెడ్డి, సేవా సమితి మండల కన్వీనర్ సేని వెంక న్న, సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

నెన్నెల, సెప్టెంబరు 15: మండలంలోని చిన్న వెంకటాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు పోతునూరి రాజాగౌడ్ ఆదివారం ఈత చెట్టు పైనుంచి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. కల్లు తీసేందుకు చెట్టు పైకెక్కిన రాజాగౌడ్ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. గమనించిన సహచరులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన అతడిని మంచిర్యాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు వెన్నుముక విరిగిందని, మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చి వైద్య అందిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం అధ్యక్షుడు మల్లాగౌడ్ కోరారు.

మితిమీరిన రాజకీయ జోక్యంతో సంస్థకు నష్టం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 15: రాజకీయ జోక్యంతో సంస్థ కు నష్టం వాటిల్లుతుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ జోక్యం పెరిగి సింగరేణికి నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అధికారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఆ ప్రభుత్వ విధానాలు నచ్చక కాంగ్రెస్‌ను ఎన్నుకుంటే ఆ పార్టీ పాలకులు సైతం అదే ధోరణి అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. సిన్సియర్‌గా పని చేసే అధికారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సింగరేణిలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోకుండా చూడాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 15: మందమర్రి సర్కిల్ పరిధిలోని మందమర్రి, రామకృ ష్ణాపూర్, కాసిపేట ఏరియాల్లో గణేష్ మండప నిర్వాహకులు సోమవారం నిమజ్జనం సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఐ విలేకరులతో మాట్లాడారు. అందుబాటులోఉన్న చెరువుల్లో, వాగుల్లో గణపతి విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లేందుకు అధిక సౌండ్‌తో కూడిన డీజేలను వినియోగిస్తే కేసులు నమోదవుతాయన్నారు. విగ్రహాలు తీసుకెళ్లే వాహనాల్లో మద్యం మత్తులో ఉన్న వారిని అనుమతించకూడదని చెప్పారు. రెచ్చగొట్టే నినాదాలు చేయవద్దని, మత స్థలాల వద్ద ఆపడం సరికాదన్నారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలని కోరారు.

తీవ్ర గాయాలతో యువకుడి మృతి

జైపూర్, సెప్టెంబరు 15: మండలంలోని షెట్‌పల్లి గ్రామంలో గోలాడ మల్లేష్(38) అనే యువకుడు మద్యం మత్తులో వాటర్ ట్యాంక్ ఎక్కి దూకడంతో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. జైపూర్ ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేష్ మద్యానికి బానిస కావడంతో భార్య సుమలత మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. శనివారం రాత్రి మద్యం తాగి వాటర్ ట్యాంక్ ఎక్కి దూకడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ చెప్పారు. మల్లేష్ తల్లిదండ్రులు తమ కుమారుడు రాత్రి నుంచి కనిపించడం లేదని వెతకడంతో వాటర్ ట్యాంక్ సమీపంలో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 15: బీజేపీ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ అన్నారు. పట్టణంలో ఆదివారం 43, 56 బూత్‌లలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో బలమైన పార్టీగా బీజేపీ పార్టీ ముందుకు వెళ్తుందని, ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు వినాయక మండపాలను దర్శించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షు రాలు కళ్యాణి, నాయకులు రాచర్ల సంతోష్, గంధపు అనిల్, శ్రీనివాస్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బీజేపీలో సభ్యులుగా చేరాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ పిలుపునిచ్చారు. వేమనపల్లిలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సభ్యత్వం నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఏట మధూకర్, కేశవరెడ్డి, అజ్మీరా శ్రీనివాస్, శ్రావణ్, దుర్గం ఎల్లయ్య, పుల్లయ్య, జాడి గోపాల్, ఎల్లుల వెంకటేష్, తిరుపతి, లింగయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పగుళ్లు తేలిన వాటర్ ట్యాంక్



శిథిలావస్థకు చేరిన ట్యాంకు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 15: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం సమీపంలో గల సింగరేణి వాటర్ ట్యాంకు పగుళ్ల తేలి శిథిలావస్థకు చేరుకుంది. కొద్ది రోజులుగా ఈ వాటర్ ట్యాంకు బిచ్చలు ఊడి పడుతున్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం సింగరేణి కాలనీవాసుల దాహార్తి తీర్చేందుకు ఈ వాటర్ ట్యాం కును నిర్మించింది. ప్రజలకు తాగు నీరు సరఫరా చేసింది. కాగా కొంత కాలంగా ట్యాంకుకునీరు సరఫరా లేకుండా నిలిపివేసింది. దీంతో నిరుపయోగంగా మారింది. అధికారులు దీన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభించిన మూడు నెలలకే పగుళ్లు



రామన్‌కాలనీ వద్ద దెబ్బతిన్న బ్రిడ్జి

మందమర్రి టౌన్, సెప్టెంబరు 15 : పట్టణంలోని రామన్‌కాలనీ సమీపంలో దాదాపు 45 కోట్ల వ్యయంతో నిర్మించిన రైల్వే బ్రిడ్జి ప్రారంభించిన రెండు నెలలకే పగుళ్ల తేలింది. బ్రిడ్జి పై ఉన్న రోడ్డుపై రంధ్రం పడిం ది. దీనిని ప్రారంభించిన రెండు నెలల వ్యవధిలోనే పగుళ్ల తేలి రంధ్రం పడడంపై ప్రజలు మండిపడుతున్నారు. నాణ్యత లేమితో పనులు చేయడం వల్ల పగుళ్ల తేలాయని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 15: సిర్పూరు నియోజకవర్గ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని యువత కోసం వివిధ కంపెనీలతో మాట్లాడామన్నారు. త్వరలోనే జాబ్ మేళాలు చేపడతామన్నారు. యువత తమ కాళ్లపై తాము ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే బాలికలు చదువుకునేందుకు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీఎం క్రీడామైదానంలో ఎగ్జిబిషన్ పెట్టడం దారుణమన్నారు. ఎస్పీఎం యాజమాన్యం కేవలం కవ్వింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఈ గ్రౌండులోనే గణనాథుల ప్రదర్శన, బతుకమ్మల ఆటలు ఆడతారన్నారు. యాజమాన్యం వెంటనే ఈ చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. లేని పక్షంలో ఉద్యమబాట పడుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు మతఘర్షణలకు తావివ్వలేదన్నారు. కానీ కాంగ్రెస్ హయాంలో జైనూరు లాంటి ఘటనలు జరిగాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలున్నారు.

ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వాలి



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 15: ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లింగాపూర్ మండలానికి చెందిన 40మంది లబ్ధిదారులకు ఆమెచెక్కులను అందజేశారు. ఈసందర్భంగామాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినహామీమేరకు నగదుతోపాటుతులంబంగారం అందజేయాలన్నారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



నాగమ్మ చెరువు వద్ద చేస్తున్న ఏర్పాట్లు

సిర్పూర్(టి), సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని నాగమ్మ చెరువువద్ద సోమ, మంగళవారాల్లో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి గ్రామపంచాయతీ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సందర్భంగా చెరువు కట్టపై చదును చేశారు. ఏర్పా ట్లను ఎస్సై కమలాకర్, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా గణేష్ నిమజ్జనం చేపట్టాలని, నాగమ్మచెరువులో నీరుఎక్కువ ఉన్న ప్రదేశాల్లోకి వెళ్లే ప్రయత్నం చేయవద్దని, పైనుంచే విగ్రహాల నిమజ్జనం చేయాలన్నారు.

వినాయక మండపాల్లో అన్నదానాలు



ఆసిఫాబాద్: అన్నదానంలో పాల్గొన్న భక్తులు



ఆసిఫాబాద్: బజార్‌వాడీలోని గణేష్ మండపం వద్ద లక్కీడ్రాలో కారు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 15: వినాయకనవరాత్రి ఉత్సవాలు చివరిదశకు చేరుకున్న సందర్భంగా ఆదివారం వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలుజోరుగా కొనసాగాయి. జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడలో, బజార్‌వాడీలో, పొట్టిశ్రీరాములు చౌక్‌వద్ద, కోదండరామాలయంలో, రాజంపేటలోని సాయినివాడలో, కంచుకోటలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పలు గణపతుల వద్ద ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అన్నదాన కార్యక్రమాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

లక్కీడ్రాలు..

జిల్లావ్యాప్తంగా వారం రోజులనుంచి వాడవాడలా వినాయకుల సందడి నెలకొంది. మండపాలవద్ద నిర్వాహకులు లక్కీడ్రాలు నిర్వహిస్తున్నారు. డెకరేషన్‌తో పాటు ఒక్కొక్క రకమైన వస్తువులతో ఒక్కోచోట వినాయకులను ఏర్పాటుచేస్తూ వినూత్నంగా కొత్తదనం ఉట్టి పడేలా నిర్వహిస్తున్నారు. వినాయకమండపాల నిర్వాహకులు లక్కీడ్రాలో భక్తులను ఆకట్టుకునే విధంగా కారు, బైక్, ఎల్ఈడీ టీవీలు, మొబైల్‌ఫోన్లు, బంగారు, వెండి ఇలా అనేక వస్తువులను పెట్టారు. జిల్లాకేంద్రంలోని బజార్‌వాడీలో సేవా యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండలివద్ద బలీనో కారు లక్కీడ్రాగా పెట్టగా అనేకచోట్ల ద్విచక్ర వాహనాలు, బంగారం, రిఫ్రిజిరేటర్లు పెట్టారు. లక్కీడ్రా పెట్టి డ్రా కంటే అధికంగా వచ్చిన మొత్తాన్ని నిర్వహణకు వాడుతున్నారు. స్వచ్ఛందంగా ఎవరైనా వినాయకుడికి చందా ఇస్తే మాత్రం తీసుకుంటున్నారు. మండపాల వద్ద నిర్వాహ కులు లక్కీడిప్‌లను నిమజ్జనం రోజు విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేయనున్నారు.

రెబ్బెన: రెబ్బెన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వేదపండితులు మహిళలతో కుంకుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు రాజేశ్వర రావు, లోకేష్‌నాయుడు, తిరుపతి, వెంకటేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట: మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద మహిళలు ఆదివారం 35రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

వ్యవసాయాధికారికి ఘనంగా వీడ్కోలు

పెంచికలపేట, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని రైతువేదికలో బదిలీపైవెళ్తున్న మండల వ్యవసాయాధికారి రాజులనాయుడును స్థానికనాయకులు, ఫర్టిలైజర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో రైతులకు అందించిన సేవలు తృప్తినిచ్చాయని, బదిలీపై వెళ్లడం కష్టంగా ఉన్నప్పటికీ బదిలీలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో రామకృష్ణ, శ్రీనివాస్, సంజీవ్, రాజన్న, సుధాకర్,తిరుపతి, సాజిద్, శ్రీనివాస్, రమేష్, రాజన్న, బండన్న, వెంకటచలం, రాజు పాల్గొన్నారు.

అంధకారంలో ప్రధాన వీధులు

పెంచికలపేట, సెప్టెంబరు 15: మండలంలోని ఎల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో వీధిదీపాలు లేక ప్రధానరహదారులు అంధకారంలో మగ్గుతున్నాయి. వీధిదీపాలు లేక రాత్రిసమయంలో ప్రజలు ఇల్లు దాటలేని పరిస్థితులు నెలకొన్నాయి. చీకట్లో ఎలాంటి అపాయం ముంచుకొస్తుందని భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై ప్రత్యేకాధికారి, గ్రామ పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు

బెజ్జూరు, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం విశ్వబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మజయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా ముందస్తుగా ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘంసభ్యులు శ్రీనివాస్, పురుషోత్తం, రమేష్, షణ్ముఖ, శ్రీకాంత్, శ్రీనివాస్‌శ్రీధర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలి



మంత్రి సీతక్కతో బెజ్జూరు మండల గిరిజన నాయకులు

బెజ్జూరు, సెప్టెంబరు 15: మండలంలోని కుశ్నపల్లి నుంచి గూడెం వయా సోమిని, హేటిగూడ నుంచి కమ్మర్‌గాం, కమ్మర్‌గాంనుంచిమురళీగూడ, పెంచికలపేట నుంచి నందిగాం వయా ఆగర్‌గూడ గ్రామా లకు రోడ్డు మరమ్మతులు, శాశ్వతరోడ్ల నిర్మాణాలు చేపట్టాలని బెజ్జూరు, పెంచికలపేట మండలాలకు చెందిన గిరిజనులు, రాయిసెంటర్ సభ్యులు ఆదివారం మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో నాయకులు శంకర్, విశ్వేశ్వర్, రమేష్, ప్రభా కర్, లాలయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

కెరమెరి, సెప్టెంబరు 15: గోయగాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉన్న బోరులో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు ఉబికివస్తోంది. బోర్‌వెల్ ఆఫ్ చేసినప్పటికీ నీరు పంపు నుంచి ప్రవహిస్తుండడంతో ఈ ప్రాంతప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తోడు పక్కనే కుమరంభీం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ఉండడంతోభూగర్భజలాలు పెరిగినీరు ప్రవహిస్తోందని పలువురు పేర్కొంటున్నారు.



బోరులో నుంచి ఉబికి వస్తున్న నీరు

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి),సెప్టెంబరు 15: మండలం మీదుగా మహారాష్ట్రకు ఆదివారం అక్రమంగా తరలి స్తున్న 20క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తమకు అందిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేపడుతుండగా కాగజ్ నగర్‌కు చెందిన ఎండీ అఫ్జల్, ఎండీ తాజ్ పికప్ వాహనం (ఏపీ01వై4233)లో కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రకు బియ్యం తరలిస్తుండగా మండలంలోని జక్కపూర్ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యంను సీజ్‌చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

బెజ్జూరు, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో కొత్తగూడెం గ్రామం నుంచి లుంబినీనగర్ వరకుగల బీటీరోడ్డు గుంతలమయంగా మారడంతో ఆదివారం బీజేపీ నాయకులు శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. రోడ్డువిషయమై ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుకు విన్నవించగా మాజీజడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఆయన వెంట మాజీఎంపీపీ శంకర్, నాయకులు మల్లయ్య, దిగంబర్, వసీఖాన్, భిక్షపతి, తిరుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

దండేపల్లి, సెప్టెంబరు 15: టీపీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ గాంధీ భవనంలో ప్రమాణ స్వీకారం ఆదివారం చేసిన కార్యక్రమానికి దండేపల్లి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆయన నివాస గృహం నుంచి గాంధీ భవన్‌కు ఎమ్మెల్యేతో కలిసి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులే సూత్రధారులు


ఫోర్జరీ సంతకాలతో
విరాసత్‌కు యత్నం

'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం



ఫోర్జరీ సంతకాలతో విరాసత్ కోసం దరఖాస్తు చేసిన భూమి

- ఫోర్జరీ కేసులో ముగ్గురు ఉద్యోగుల అరెస్ట్
- పరారీలో మరో ప్రభుత్వ ఉద్యోగి
- భూమి విరాసత్‌లో వారి పాత్రే కీలకం
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన డొంక
- విధిలేని పరిస్థితుల్లో పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు
- ఎఫ్ఐఆర్ నమోదుతో జైలు పాలైన ఆర్ఐ, సిబ్బంది

మంచిర్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మరణించిన వారి సంతకాలు ఫోర్జరీ చేసి భూమిని విరాసత్ చేసుకోవాలని చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టిన ఘటనలో అసలు సూత్రధారులు రెవెన్యూ, ఇతర ప్రభుత్వ ఉద్యోగులేనని తేలింది. 'ఆంధ్ర జ్యోతి' ఆధారాలతో సహా అక్రమాలను బయట పెట్టడంతో విధిలేని పరిస్థితుల్లో తహసీల్దార్ పోలీసు లకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ ఐఆర్ కూడా నమోదు చేశారు. దీంతో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు జైలు ఊచలు లెక్కబెడుతుండగా, మరో ఉద్యోగి పరారీలో ఉన్న సంఘటన జిల్లాలో సంచలనం సృష్టి స్తోంది. ఎప్పుడూ లేని విధంగా ఒకే కేసులో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులపై పోలీసు కేసులు నమోదు కావడం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశం అవుతోంది.

పోలీసుల విచారణలో..

పోలీసుల విచారణలో నిందితులుగా నిరూపణ అయిన గొర్రె స్వామి-ఏ1తోపాటు ప్రభుత్వ ఉద్యోగులైన చంద్రమౌళి (ఆర్ఐ)-ఏ2, బైరం విజయ్-ఏ3 (ఇరిగేషన్ డిపార్టుమెంట్), బైరం ప్రభాకర్-ఏ4 (ఇరిగేషన్ డిపార్టుమెంట్), బైరం రమేశ్-ఏ5 (ఇరిగేషన్ డిపార్టుమెంట్), సారంగుల లింగయ్య-ఏ6లపై ఎఫ్ఐఆర్ నమోదైంది. వీరిలో చంద్రమౌళి, బైరం ప్రభాకర్, గొర్రె స్వామి, సారంగుల లింగయ్యను పోలీసులు అరెస్టు చే యగా ప్రస్తుతం జైల్లో ఊచలు లెక్కబెడుతున్నారు. కాగా బైరం విజయ్, బైరం రమేశ్ పరారీలో ఉన్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

సంఘటన పూర్వపరాలు..

దండేపల్లి మండల కేంద్రానికి చెందిన గొర్రె జానీకి 1.18 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయనకు ఇద్దరు కుమారులు పౌల్, స్వామి ఉన్నారు. జానీ అనారోగ్యం కారణంగా 2012లో మరణించగా, అతని భార్య మరియ గత ఏడాది సెప్టెంబరులో చనిపోయింది. కాగా జానీ దం పతుల పెద్ద కుమారుడు పౌల్ కూడా 2024 జనవరి 6న అనారోగ్యంతో మరణించాడు. పౌల్ భార్య ఏసుమణికి తెలియకుండా తన తండ్రి పేరిట ఉన్న భూమిని రెండో కుమారుడు స్వామి విరాసత్ చేసుకునేందుకు ప్రయత్నం చేశాడు. విరాసత్ చేసు కొనే క్రమంలో స్వామి 2023 ఏప్రిల్ 28న మీ సేవాలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకోసం అప్పటికే చనిపోయిన అతని సోదరుడు పౌలు, తల్లి మరియ సంతకాలను ఫోర్జరీ చేశారు. ఫోర్జరీ సంతకాలతో కూడిన ఫైలును 14 నెలల తరువాత 2024 జూన్‌లో తహసీల్దార్ కార్యాలయానికి పంపించారు. దరఖాస్తు అందిన తరువాత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన అనంతరం మరణించిన వారి కుటుంబ సభ్యుల సమక్షం లో పంచనామా చేయాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యుల సంతకాలు సేకరించిన తరువాత సదరు ఫైలును తహసీల్దార్ లాగిన్‌లో పొందు పర్చాలి ఉంటుంది. అయితే దరఖాస్తుపై ఎవరు సంతకం చేశారో నిర్ధారించకుండానే ఆర్ఐ తహసీల్దార్ లాగిన్‌లో నమోదు చేయడం గమనార్హం. ఆర్ఐ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా మండల తహసీల్దార్ సంబంధిత ఫైలును అప్రోవల్ కోసం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి పంపిం చారు. అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ లాగిన్‌కు సైతం వెళ్లింది. సంబంధిత ఫైలు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో అనుమానం వచ్చిన కలెక్టర్ కార్యాలయం సిబ్బంది దాన్ని తిరస్కరించారు. ఈ అక్రమ బాగోతంపై 'ఫోర్జరీ సంతకాలతో విరాసత్‌కు యత్నం' శీర్షికన ఈ నెల 7న 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితం కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఆర్ఐ కనుసన్నల్లోనే..

ఫోర్జరీ సంతకాల తతంగమంతా ఆర్ఐ చంద్రమౌళి కనుసన్నల్లోనే జరిగినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆర్ఐతోపాటు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేసే బైరం విజయ్‌కి లక్షెట్టిపేట ఇరిగేషన్ డిపార్టుమెంట్‌లో విధులు నిర్వహించే మరో ముగ్గురు ఉద్యోగు లు సహకరించినట్లు తేలింది. 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడం తో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ సంధ్య విధిలేని పరిస్థి తుల్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో ఫోర్జరీ జరిగినట్లు నిరూపణ కావడంతో నిందితుడు గొర్రె స్వామితోపాటు నలుగురు ప్రభుత్వ ఉద్యోగులపై కేసు నమోదైంది.

మరికొందరు కూడా..

ఫోర్జరీ కేసుకు సంబంధించి ప్రస్తుతం పోలీసులు ఆరుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, సంబంధం ఉన్న మరి కొందరిపై త్వరలోనే చర్యలు ఉండే అవకాశాలు ఉన్నాయి. కేసును లోతుగా విచారించే కొద్దీ మరికొందరు తెరపైకి వస్తున్నారని, త్వరలోనే పరారీలో ఉన్న బైరం విజయ్, బైరం రమేశ్‌తోపాటు మిగతా వారిని కూడా అరెస్టు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

హ్యాండ్‌బాల్ జట్టుకు ఘన స్వాగతం



సభ్యులకు స్వాగతం పలుకుతున్న హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన 38వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ గోల్డ్‌మెడల్ సాధించిన జట్టు సభ్యులకు ఘనస్వాగతం లభించింది. ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టును ఓడించి గోల్డ్ మెడల్ సాధించిన జట్టు సభ్యులు ఆదివారం రైలు ద్వారా మంచిర్యాలకు చేరుకున్నారు. సభ్యులకు హ్యాండ్ బాల్ అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కర్ర మహేందర్‌రెడ్డి, తదితరులు స్వాగతం పలికారు. జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన రఘ కోచ్ సునార్కర్ అరవింద్‌ను సత్కరించారు.

సీతారాం ఏచూరి జీవితం స్ఫూర్తిదాయకం



సీతారాం ఏచూరికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జీవితాం స్ఫూర్తిదాయకమని, ఆయన మరణం దేశానికి తీరని లోటని రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఉద్యమంలో తమదైన శైలిలో విద్యరంగంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. కామన్ మినిమం ప్రోగ్రాం రూపొందించడలో కీలక పాత్ర పోషించారన్నారు. కమ్యూనిస్టు భావజాలంతో ప్రజా ఉద్యమంలో రెండు పర్యాయాలు పార్లమెంటు సభ్యుడిగా పార్టీలకు అతీతంగా ప్రశంసలు అందుకున్నారని చెప్పారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, గోమాస ప్రకాష్, ప్రేమ్‌కుమార్, మహేష్, మోహన్, నర్సింగరావు, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై భయాందోళనకు గురికావద్దు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15: ప్రతి ఒక్కరూ ఆత్మస్థైర్యంతోనే సమస్యలను ఎదుర్కోవాలని, భయాందోళనకు గురికావద్దని సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని కస్తూర్బా జూనియర్ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో చిన్నపాటి ఒత్తిడులు, ఆవేశాలకుగురై క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడడం సరైంది కాదన్నారు. ముఖ్యంగా యువత ప్రేమ విఫలమైం దని, మార్కులు తక్కువ వచ్చాయని, పరీక్షలు ఫేయిల్ అయ్యామని, తల్లిదండ్రులు తిట్టారని ఆవేశానికిగురై పెద్దపెద్ద ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారని అన్నారు. మత్తు పదార్థాలు, మద్యానికి దురలవాట్ల నుంచి బయట పడలేక జీవితాన్ని చేజేతుల కోల్పోతున్నారని పేర్కొన్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న మాట్లాడుతూ జీవితంలో సమస్యలు ప్రతి ఒక్కరికి సర్వసాధారణమని, మానసిక ధైర్యాన్ని పెంచుకొని, నిరాశ చెందకుండా ముందుకు సాగాలన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భూపతి నారాయణ, నాయకులు సుమన్, కోటేశ్వర్‌రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 15: జిల్లాలో పని చేస్తున్న ఫొటో, వీడియో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు కొత్తపల్లి సతీష్, శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నూతన కార్యవర్గం ఎన్నికల సందర్భంగా మాట్లాడారు. వీడియో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు వచ్చేలా చూస్తామన్నారు. కాగా వీడియో జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి సతీష్‌ను ఓటింగ్ ద్వారా ఎన్నికున్నారు. ఉపాధ్యక్షుడిగా పోచర్ల శ్రీనివాస్, కార్యదర్శిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రఘు, రాము, గౌరవ అధ్యక్షుడిగా ఈసంపెల్లి రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జుట్టు రమేష్, హనుమాండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటం భావితరాలకు ఆదర్శం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

బెల్లంపల్లి, సెప్టెంబరు 15: నైజాం రజాకారులకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భావి తరాలకు ఆదర్శమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య అన్నారు. పట్టణం లోని భగత్‌సింగ్ స్థూపం వద్ద ఆదివారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజాకారులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఎంతో గొప్పదన్నారు. నాడు ప్రతీ పల్లెల్లో రజాకారులు, భూస్వాములకు కొమ్ముకాసి పేదలను చిత్రహింసలకు గురి చేశారన్నారు. ఈ పోరాటాల్లో 4,500 మందికి పైగా కమ్యునిస్టులు తమ ప్రాణాలను అర్పించారన్నారు. ఈ నెల 17 వరకు నిర్వహించే వార్షికోత్సవా లను ఘనంగా నిర్వహించుకోవాలని సూ చించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బొల్లం పూర్ణిమ, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, నాయకులు దాగం మల్లేష్, బొంతల లక్ష్మీనారాయణ, బియ్యాల ఉపేందర్ పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాలు చిరస్మ రణీయమని, ఆ పోరాటాలు ప్రజలకు స్ఫూర్తి నిచ్చాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కలవేన శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారా మయ్య అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద ఆదివారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ముందుగా తెలంగాణ సాయు ధ పోరాటంలో అమర వీరులకు నివాలులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్, రాజేషం, దుర్గరాజు, పెద్దపల్లి బానయ్య, తిరుపతి, గాండ్ల సంపత్, శర్మ, తదితరులు పాల్గొన్నారు. కాగా తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తే ప్రజలు క్షమించ రని సీ పీఐ పట్టణ కార్యదర్శి దుర్గారాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ సెంటర్లో వారోత్సవాలను పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అమర వీరుల స్తూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సోముశెట్టి రాజేషం, కంది శ్రీనివాస్, మర్రికుమార్, రాజేష్ యాదవ్, రాయబారపు వెంకన్న, ఆంథోని దినేష్, జెట్టి మల్లయ్య, వెల్డి ప్రభాకర్, బియ్యాల పద్మ, ఎలిగేటి వజ్ర, పాల్గొన్నారు.

నస్పూర్: భారత కమ్యూనిస్టు పార్టీ ఆదివారం నస్పూర్, తాళ్లపల్లి గ్రామ సమితి ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. నస్పూర్ కాలనీలో జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగం రవి, షిర్కె సెంటర్‌లో గ్రామ కార్యదర్శి మిర్యాల రాజేశ్వర్‌రావు, మండల కార్యదర్శి జోగుల మల్లయ్యలు జెండాలను ఎగుర వేశారు. కార్యక్రమాల్లో సీపీఐ నాయకులు కారుకురి నగేష్, రవీందర్, కొమురయ్య, రాంచందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం

లక్షెట్టిపేట రూరల్, సెప్టెంబరు 15 తెలంగాణ అసంఘటిత కార్మికుల బిడ్డల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఆ సంఘం అధ్యక్షుడు మేదరి దేవవరం అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం ఆ సంఘం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో ఉపాధిహామీ కార్మికులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు తగిన వేతనాలు అందజేయాలన్నారు. మోటర్ వర్కర్స్ యూనియన్, హమాలి తదితర కార్మికులకు వారివారి రంగాల్లో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం త్వరలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. చలో హైదరాబాద్, తదితర కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుర్గం దేవయ్య, కార్యదర్శి కేతిరెడ్డి రమణారెడ్డి, కోశాధికారి లింగంపల్లి భానుచందర్, ఉపాధ్యక్షుడు రాచర్ల రవికిరణ్, అడ్లూరి లక్ష్మి, మేడి భాగ్య, మౌనిక పాల్గొన్నారు.

కుటుంబాలకు అండగా ఉంటాం

బెల్లంపల్లి, సెప్టెంబరు 15: పట్టణంలో ఇటీవల మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లయ్య, చక్రపాణి కుటుంబ సభ్యులను ఆదివారం పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పరామర్శించారు. నాయకుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీకి మలయ్య, చక్రపాణిల సేవలు మరువలేనివన్నారు. అనంతరం వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాలుల ర్పించారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి రాయలింగు యాదవ్, శంకర్‌సింగ్, బండి రాము, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల: కుశ్నపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు బెల్లంపల్లి మహేశ్వర్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి ఇటీవల మృతి చెందగా పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, నర్సింహారావు, మల్లాగౌడ్ తదితరులు ఉన్నారు.

వర్గీకరణపై కమిటీని ఉపసంహరించుకోవాలి



నియామకపత్రాలు అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 15: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలితం శంకర్, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం అన్నారు. జాతీయ మాల మహానాడు నస్పూర్ మున్సిపాలిటీ సమావేశం ఆదివారం శ్రీరాంపూర్‌లోని ఓ పాఠశాలలో నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా ఏకపక్షంగా వర్గీకరణ అమలు పేరుతో మంత్రుల కమిటీ వేయడం సమంజసం కాదన్నారు. దానికి చైర్మన్‌గా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మిగతా సభ్యులు ఇతర కులాల వారు ఉన్నారని చెప్పారు. మాలలుగాని, మాల ఉపకులాల వారు లేరని తెలిపారు. ఇది మాలలకు జరిగిన అన్యాయం కాదా వారు ప్రశ్నించారు. ఈ కమిటీతో మాలలు, మాల ఉప కులాలను మోసగించడానికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆరోపించారు. ఈ మంత్రుల కమిటీ స్థానంలో న్యాయమూర్తితో కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా కంటే మాలల జనాభా ఎక్కువగా ఉందని చెప్పాం'ు. ప్రభుత్వం మాలలకు అన్యాయం చేయాలని చూస్తే గతంలో చంద్ర బాబుకు పట్టిన గతే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పడుతుందని వారు హెచ్చరించారు. అనంతరం జాతీయ మాల మహానాడు నస్పూర్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఐతే పరమేష్, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడిగా పుట్ట రవిని నియమించారు. అలాగే జై భీమ్ సైనిక్ దళ్ మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడిగా కాటం రాజు, నస్పూర్ పట్టణ అధ్యక్షుడిగా బింగి సదానందం, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడిగా దొంతమల్ల శివకుమార్‌ను నియమించారు. వీరికి నియామక పత్రాలు అందజేశారు. ఇటీవల జాతీయ మాల మహానాడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి శ్రీని వాస్, జిల్లా అధికార ప్రతినిధిగా తలారి రాజు ఎన్నిక కాగా, వారితో పాటు నూతన కమిటీలను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు గరిసె రామస్వామి, జై భీమ్ సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేష్, ఉపాధ్యక్షుడు జింజుపల్లి నర్సింగ్, ప్రధాన కార్యదర్శి సొల్లు శ్రీనివాస్, నాయకులు కొటం కృష్ణ, చెవుల వాసు, దొంత మురళి, అనిల్, బత్తుల స్వామి, చీదురు సంతోష్, డి పోశం, టి శ్యాముల్, రత్నయ్య, విఠల్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకు కూరల విత్తనాల పంపిణీ

నస్పూర్, సెప్టెంబరు 15: సీతారాంపల్లి గ్రామంలో హాజీపూర్ ఎఫ్‌పీసీ ఆధ్వర్యంలో ఆదివారం ఆకు కూరల విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం రైతులతో కలిసి గోనె శ్యాంసుందర్ రావు తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రావు రైతులకు సేంద్రియ పద్ధతి ద్వారా వ్యవసాయం సాగు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో సేంద్రియ వ్యవసాయమే మానవ మనుగడకు ఆధారమన్నారు. వ్యవసాయ రంగంలో క్రిమిసంహారక మందుల వాడకం కారణంగా భూమి, నీరు,గాలి కలుషితమైపోతుందన్నారు. రైతులంరూ సేంద్రియ పంటలు పండిస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పీసీ డైరెక్టర్ బొలిశెట్టి తిరుపతి, రైతులు పానుగంటి రంగారావు, శ్యాంసుందర్‌రెడ్డి, కుటుకూరి తిరుపతి, జాడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులను మోసగించిన వ్యక్తి అరెస్ట్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 15: క్యాష్ కౌంటింగ్ మిషన్ మరమ్మతు చేస్తానని నమ్మించి, 50 వేల రూపాయలతో ఉడాయించిన వ్యక్తిని మంచిర్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా వణి గ్రామానికి చెందిన రోహిత్ బాబూలాల్ ప్రకాష్ కాలే అనే వ్యక్తి కొన్నేళ్లుగా కుటుంబ సభ్యులతో కలిసి సికింద్రాబాద్‌లో జీవిస్తున్నాడు. తన తండ్రి, అన్నతో కలిసి నిజామాబాద్‌లోని పోలీస్‌స్టేషన్లలో ప్రింటింగ్ అండ్ జిరాక్స్ మిషన్లు రిపేర్ చేసేవాడు. తండ్రి, అన్న అనారోగ్యంతో మరణించారు. దీంతో రోహిత్ బాబూలాల్ ప్రకాష్ కాలే పని లేకుండా ఖాళీగా తిరిగే వాడు. గత నెల 3వ తేదీన మంచిర్యాల ఐబీ చౌరస్తాలో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అధికారులను కలిసి తాను క్యాష్ కౌంటింగ్ మిషన్ రిపేరు చేస్తానని చెప్పాడు. దీంతో అతడికి పని అప్పగించారు. కొద్దిసేపు మెషిన్ బాగు చేస్తున్నట్లు నటించి పని పూర్తయ్యిందని చెప్పాడు. మెషిన్‌ను పరీక్షించేందుకు 50 వేల రూపాయలు క్యాష్ కావాలని క్యాషియర్ వద్ద డబ్బు తీసుకున్నాడు. అధికారుల దృష్టి మరల్చి ఆ డబ్బులతో ఉడాయించాడు. తాము మోసపోయామని తెలుసుకున్న బ్యాంకు అధికారులు మంచిర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ బన్సీలాల్, సెక్టార్ ఎస్ఐ వినీత నిందితుడు రోహిత్ బాబూలాల్ ప్రకాష్ కాలేను పట్టుకొని విచారణ చేపట్టగా, అతను గతంలో మెదక్, మంచిర్యాల జిల్లాల్లో గల బ్యాంకులను మోసగించాడని, ఆ డబ్బులను జల్సాల కోసం వినియోగించాడని తెలిసింది. అనంతరం అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బ్యాంకు, ఫైనాన్స్ కంపెనీలకు చెందిన అధికారులు గుర్తు తెలియని వ్యక్తులను తమ కార్యాలయాల్లోకి అనుమతించవద్దని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ కోరారు.

కళాకారులు సత్తా చాటాలి

మందమర్రి టౌన్, సెప్టెంబరు 15 : కోల్ ఇండియా పోటీల్లో సింగరేణి కళాకారులు సత్తా చాటి బహుమతులు సాధించాలని కేకే 5 గని రక్షణాధికారి రమేశ్ తెలిపారు. వార్షిక క్రీడల్లో భాగంగా కల్చరల్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నటరాజ చిత్రపటానికి పూల మాల వేసి మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. సీఎండీ క్రీడాభివృద్ధికి, క్రీడాకారులకు చేయూతనందిస్తున్నారన్నారు. . ఏరియాతో పాటు రీజియన్ స్థాయి పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, కళాకారులు సాధనవేని ప్రభాకర్, ఎగ్గేటి రాజేశ్వర్‌రావు, సుదర్శన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

లక్షెట్టిపేట రూరల్, సెప్టెంబరు 15: పదోన్నతి పొందిన ఆదివాసీ ఉపాధ్యాయులకు ఆదివాసి తోటి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లక్షెట్టిపేటలో సన్మానించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా చక్కటి దత్తు, ఆత్రం నారా యణ, తిరుమల రాజవేణు, ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఆత్రం రఘునాథంను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆత్రం రవీందర్, జిల్లా అధ్యక్షుడు వల్కు చిలుకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సింగ వెంకటేష్, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తోటి సేవా సంఘం అధ్యక్షులు ఆత్రం సంతోష్‌కుమార్, జిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు కురిసెంగ మోతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

దండేపల్లి, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని రామాలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, స్వాధ్యాయ పరివారం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, స్వాధ్యాయ పరివారం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 15: నాలుగో విడతలో భాగంగా మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో మిగిలిగి ఉన్న 27 సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిన్నట్లు ప్రిన్సిపాల్ వై రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీన ఒరిజనల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో ఉదయం 11 గంటలలోగా దరఖాస్తు చేసుకొని, మధ్యాహ్నం ఒంటి గంటకు మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో హాజరు కావాలని కోరారు. ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ 12 సీట్లు, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 6 సీట్లు, మెకానిక్ మోటార్ వెహికల్ 5 సీట్లు, టర్నర్ 3 సీట్లు, కోపా 1 సీటు మొత్తం 27 సీట్లు ఉన్నాయని, ఈ అవకాశాన్ని అర్హులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.